# నాకు నచ్చిన కథ

నాకు నచ్చిన కథగురించి పాఠకులు విశ్లేషణరాసి పంపితే ప్రచురిస్తాం. తగిన విశ్లేషణకు పారితోషికం ఉంటుంది

# "మచ్చల శంఖం"

శ్రీ "హితశ్రీ" గారి కథానిక 'మచ్చలశంఖం మొదటగా భారతిలో ప్రచురితమైనట్లు జ్ఞాపకం... ఆ కథను దక్షిణభారత హిందీ ప్రచారసభవారు తమ కథావీధిలో గోపీచంద్, కొడవటిగంటి కటుంబరావు, బుచ్చిబాబు, మునిమాణిక్యం నరసింహారావు, రావూరిభరద్వాజ, అడివి బాపిరాజు, నోరి నరసింహశాస్త్రి, అవసరాల సూర్యారావు, భాస్కరపట్ల కృష్ణారావు ఇల్లిందల సరస్వతీ దేవిగార్ల కథలతోపాటు సంకలనం చేసారు. సంకలనకర్త బార్గానంద్.. అన్నీ వుత్త మకథలే...

ఈ గ్రంథం అయిదన మార్చిలో 1976-77లోనే, నోచుకొంది. హిత శ్రీగారి 'మచ్చలశంఖం' నన్ను ఆకర్షించింది. నాకు బాగా నచ్చింది. కథను కనీసం మూడుసార్లు చదువుతేగాని, రచయితయేం చెప్పతల్చుకొన్నాడో అర్థంకాదు.

ఓ వితంతుస్త్రీ, తన కుమారుడితో.... సముద్రపు ఒడ్డున కూర్చొని వుంటుంది. వల్లభారావు అనే యువకుడు వారికి దగ్గరలో నిలబడి వుంటాడు. అతడికో మచ్చలశంఖం దొరుకుతుంది. దానిని చేతిలోకి తీసుకొని చూస్తుంటాడు... అదే శంఖాన్ని... వితంతుయువతి కుమారుడు ఆపేక్షగా, ఆశగా, చూస్తాడు. వల్లభరావు కుర్రవాడికి ఆ మచ్చల శంఖం యిస్తాడు. సంకోచిస్తూ ఆ కుర్రవాడు ఆ శంఖం తీసుకొంటాడు.

కథంతా మచ్చల శంఖం చుట్టూ తిరుగుతుంది... ఆ పసివాడు తనపేరు అడిగినప్పుడు చెప్పలేడని ఆ యువతి బాధగా చెప్పతుంది. అంటే అతడు మూగవాడు. ఆ కుర్రవాడు ఎంతో అందంగా వుంటాడు. అందరినీ ఆకట్టుకొంటాడు... కాని పాపం మూగజీవి. ఆ యువతి తెల్లని చీరె కట్టుకొని వుంటుంది. ఆచీరెకు అక్కడక్కడ చిరుగులు కుట్టివుంటాయి. ఆమె ముఖంమీద బొట్టులేకపోవటంవలన ఆమె వితంతువనీ, చిరుగులు కుట్టిన చీరె ధరించినందువలన ఆమె సామాన్యకుటుంబీకురాలనీ, వల్లభరావు వూహిస్తాడు. ఆ వూహే... అతని హృదయాన్ని కదిలిస్తుంది. వారికేదన్నా సహాయం చేస్తే బావుంటుందన్న ఆలోచనవస్తుంది. అతనికి తగిన వైద్యచికిత్స చేయించి మాటలు తెప్పిస్తే? కాని అందుకు తగిన ధనవంతుడు కాదతను!

ఆయువతి వల్లభరావులోని ఆవేదనను గ్రహిస్తుంది. ఆ శంఖాన్ని సముద్రతీరాన్నే వదిలి ముందుకు వెళ్లిపోతుంది... చీకటిపడి, వెన్నెల వచ్చిన తర్వాత, వల్లభరావు వెనక్కి వచ్చి... ఆ శంఖాన్నిచూసి ఆశ్చర్యపోతాడు... తనని ఆ యువతి అపార్థం చేసుకొందేమోనని భయపడ్తాడు. తన మనస్సులో ఆమెపట్ల యెలాంటి చెడు ఆలోచనలు లేవుగదా అనుకొంటాడు. ఆ శంఖాన్ని సముద్రంలోకి విసురుతాడు. సరిగా ఆ సమయానికి ముందుకు వెళ్లిన యువతి కుర్రవానితో వెనక్కి తిరిగివచ్చి దేనికోసమో వెతుక్కొంటూ వుంటుంది. గుచ్చి అడిగితేకాని చెప్పదు తను అక్కడికి ఎందుకు వచ్చిందో?

ఆ మచ్చల శంఖాన్ని తనకోసమే అక్కడ వదిలి వెళ్లానని చెప్తుంది... ఆ శంకాన్ని వదిలి వెయ్యటం వలన, వల్లభరావు... తను వూహించిన మూడు పనులలో యేదో ఒకటి చేయగలడని అనుకొన్నానంటుంది.

ఒకటి ఆ శంఖాన్ని వల్లభరావు తన చేతి కివ్వటం;

రెండు... అలాదాన్ని అక్కడేవదిలేసి వెళ్లటం;

మూడు... దానిని సముద్రంలోకి విసిరిపారెయ్యటం.....

ఈ మూడో పని చేస్తే ఆమె ప్రయత్నం సఫలమైనట్లుగా భావిస్తానంటుంది. అంటే...ఆమె... వల్లభరావు మనస్సులోని ఆవేదనను గ్రహిస్తుంది. తనకు సహాయంచేయ్యటం వల్లభరావు శక్తికి మించిన విషయమని ఆమె వూహిస్తుంది.

ఆ మచ్చల శంఖాన్ని సముద్రంలోకి విసిరి వెయ్యటం వలననే వల్లభరావుకి వూరట కలుగుతుందని ఆమె గ్రహిస్తుంది. ఎందుకంటే అంతకంటే అతనేమీ చెయ్యలేడుగనక.

వల్లభరావు ఈ విషయం ఆమె నోటినుంచి విన్న తర్వాత ఆమెపట్ల తనకు కలిగిన చెడు ఆలోచనలను తొలగించుకొంటాడు.

ఇద్దరు సామాన్య యువతీ, యువకులమధ్య... అలజడి రేపి.. కథను నడిపిస్తుంది... ఆ మచ్చల శంఖం...

శంఖం తెల్లగా వుంటుంది... అయినా దానికి నల్లటిమచ్చలు వచ్చాయి... కథలోని యువతీ, యువకులు.. మచ్చలేని వారు... పవిత్రులు... అయినా వారి దారిద్రమే వారికి నల్లటి మచ్చగా... రచయిత... అంతర్గతంగా... పోలిక తీసుకువచ్చాడని... నేను భావిస్తాను.

ఇంకో గొప్ప సంగతేమంటే... కథ అంతా... ఒకటి రెండు గంటలలోనే జరిగిపోతుంది.

మూగతనం, దరిద్రం ఎంత బాధాకరమో... పరోక్షంగా రచయిత వర్ణిస్తాడు..../ ఇది వుత్తమమైన కథగా నేను భావిస్తాను.

ఇంక కథ చదివి.... దానిలోని శిల్పాన్ని, అందాన్ని ఆస్వాదించండి

--"శ్రీ రాగి"

